క్లుప్తంగా

ఎంపీడీఓ తనిఖీ



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి, శివాజినగర్, రేకంపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ అరుందతి మంగళవారం విస్తృతంగా తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంఖ్యపై అడిగి తెలుసుకున్నారు. నర్సరీలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజు, వినోద్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసీపీ, కమిషనర్‌ను కలిసిన నాయకులు



నర్సంపేట : ఏసీపి కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, కౌన్సిలర్ ఓర్సు అంజలి, పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు నూనె పద్మ, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మసూద్ బేగ్, పట్టణ అధికార ప్రతినిధి గుంటి వీరప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి



నర్సంపేట : పట్టణంలోని రోడ్లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరిగాని సుదర్శన్‌గౌడ్, కోట డేవిడ్, రాజశేఖర్, వెంకటాచారిలు మునిసిపల్ కమీషనర్‌ను కోరారు. తొలుత వారు కమిషనర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్, డేవిడ్, రాజశేకర్, వెంకటాచారి మాట్లాడారు. బస్టాండ్‌లోని వాటర్ కూలర్ ఏటీడబ్ల్యూను రిపేర్ చేయించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని, లే అవుట్, పర్మిషన్ లేని ప్లాట్ల విక్రయాలను, ఇళ్ల నిర్మాణాలను నిలిపేయాలని కోరారు.

'కేజీ టు పీజీ' ఉచితంగా అందించాలి

వర్ధన్నపేట : కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్య అందిస్తామన్న హామీ అమలులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి బడుగులకు ఉచితంగా అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భవిష్యతు తరగతి గదుల్లోనే నిర్మితమౌతుందని చెప్పారు. ప్రపంచంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యత పెరిగిందని తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పడినా విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా యాకూబ్



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన బరిగెల యాకూబ్‌ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర నాయకుడు కేదాసి మోహన్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో మాదిగ జాతి ప్రజలకు పాలకుల తీరుపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు. అనంతరం యాకూబ్‌కు నియామక పత్రం అందజేసి అభినందించారు. సమావేశంలో నాయకులు కొమ్ముల భిక్షపతి, చింత జోసెఫ్, కొంగర స్వామి, నమిండ్ల క్లైమెంట్, కాగిత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బోనాలు

గూడూరు : మండలంలోని బొల్లెపల్లిలో దుర్గమ్మ బోనాల పండుగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పూజా కార్యక్రమాలు ముగించుకున్న మహిళలు బోనం ఎత్తుకొని దుర్గమ్మ దేవాలయానికి మేళ తాళాలు, డప్పుచప్పుళ్ల నడుమ బయలుదేరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, మాజీ సర్పంచ్ సునీత సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిమేడారం జాతరకు వేళాయె..

● నేడు సారలమ్మ ఆగమనం

నల్లబెల్లి : మండలంలోని మద్దిమేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నేడు (బుధవారం) ప్రారంభం కానుంది. జాతరకు ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. మద్దిమేడారం శనివారం వరకు నాలుగు రోజులపాటు భక్తుల రద్దీతో కళకళలాడనుంది. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలతోపాటు ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.



ముస్తాబైన మద్దిమేడారం జాతర ప్రాంగణం



సమ్మక్క-సారలమ్మ తల్లుల గద్దెలు

గాంధీనగర్ సారలమ్మ గుడిలో..

గుండ్లపహాడ్ శివారు గాంధీనగర్‌లోని సారలమ్మ గుడిలో దురిశెట్టి వంశం ఆడపడుచు, సారలమ్మ ప్రధాన పూజారి ధర్మపురి సువర్ణ బుధవారం సాయంత్రం గుడిని శుద్ధి చేసి మట్టితో అలికి పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను అందంగా తీర్చిదిద్దుతారు. దూపదీప నైవేద్యం సమర్పిస్తారు. పూజారులు ఆనవాయితీ ప్రకారం సాకహానం ఇచ్చి పుచ్చుకని జాగారాలు చేస్తారు. శివసత్తుల పూనకాల మధ్య డోలువాయిద్యాలతో సారలమ్మని గాంధీనర్ నుంచి మద్దిమేడారానికి తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్టిస్తారు.

చిలకలగట్టు నుంచి మద్దిమేడారానికి..

గురువారం ఉదయం సమ్మక్క ప్రధాన పూజారులు దురిశెట్టి సమ్మయ్య, నాగరాజు దుష్టశక్తులు రాకుండా ప్రధాన రోడ్లకు ఇరువైపులా దిష్టితోరణాలు కడతారు. మద్దిమేడారంలోని సమ్మక్క గుడిని శుద్ధి చేసి పసుపు కుంకుమతో అలంకరిస్తారు. వస్త్రాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి ధూపదీప నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం సమ్మక్క ప్రధాన పూజారులు కొండాపూర్ శివారులోని చిలుకలగట్టుకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. యాటపోతును బలి ఇస్తారు. గురువారం సాయంత్రం డోలువాయిద్యాలతో సమ్మక్క తల్లిని పోలీసుల రక్షణ నడుమ గద్దెకు తీసుకొస్తారు. శివసత్తుల పూనకాలతో ఆ ప్రాంతం పులకించిపోతుంది. గద్దెల ప్రాంగణంలో సమ్మక్క-సారలమ్మ పూజారులు రాత్రంతా జాగరణ చేస్తారు. చల్లంగ చూడాలని పూజిస్తారు. శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లిస్తారు. శనివారం రాత్రికి తల్లులు వన ప్రవేశం చేస్తారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఏసీపీ

నాగరాజుపల్లిలో జరగనున్న మద్దిమేడారం జాతరను నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని, వాహనాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను పరిశీలించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో జాతర ఏర్పాట్లపై చర్చించారు. జాతర సమయంలో చేపట్టాల్సిన రక్షణ చర్యలను నర్సంపేట రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నగేశ్‌లకు సూచనలు అందించారు. జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నేటి నుంచి టేకుల మేడారం జాతర

టేకుల మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నేటి నుంచి ఆరంభం కానుంది. జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సదానందం తెలిపారు. జాతర విజయవంతానికి భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట : పట్టణంలో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, గిరిజనులు సాంప్రదాయ దుస్తులు ధరించి భారీ ర్యాలీ తీశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని గుర్తు చేశారు. గిరిజనులు ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీఓ వెంకటరమణ, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎద్దు సత్యనారాయణ, చోటేమియా, పోశాల వెంకన్న, రాజిరెడ్డి, అఫ్సర్, కమ్మగోని ప్రభాకర్, సమ్మెట సుధీర్‌గౌడ్, బాషా, ఖీమా, వర్జిన్, మహబూబ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అన్నదానం

ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూనర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవలు నిర్వహించడాన్ని బాధ్యతగా ఆయన అభివర్ణించారు. సంపన్నులు సంపాదించిన డబ్బులో కొంత సామాజిక సేవలకు వినియోగించాలని సూచించారు. మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం 4 రోజులపాటు అన్నదానం చేయడానికి ఎస్ఆర్ఎస్ సంస్థ ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

వేణుగోపాలస్వామికి లక్ష పుష్పార్చన

నర్సంపేట : భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణం ద్వారకపేటలోని శ్రీవేణుగోపాలస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరుట్ల వెంకటాచార్యులు, శ్రీధరాచార్యులు, యాదగిరిచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ శత సహస్ర నామావళితో ఉదయత్ పూర్వ అభిషేకాలు, విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం, ఉత్సవ మూర్తులకు లక్ష పుష్పాలంకరణ ఘనంగా నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు మహిళలు పుష్పాభిషేకం చేశారు. ఇందులో భాగంగా సమతా యాత్ర ద్వారకపేటలోని వీధుల్లో కలశ బియ్యం సేకకరించింది. తదనంతరం ఆలయ అర్చకులు శ్రీధరాచార్యులు వేదాశీర్వాదమ వి.టి శాఖ ప్రతినిధులను సన్మానించారు. తీర్థ ప్రసాద గోష్టి, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, సభ్యులు గోపగాని వెంకన్న, వేణు, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, నంద్యాల సురేశ్‌రెడ్డి, ఓరగంటి ప్రభాకర్, గాండ్లోజు భాస్కర్, బురుగు సాంబయ్య, గంట లక్ష్మణరెడ్డి, వికాస తరంగిణి బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కలశ బియ్యంతో అర్చకులు, తదితరులు

మేడారం భక్తులతో బస్టాండ్ కిటకిట



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎం ప్రసన్నలక్ష్మి



టికెట్ల కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

నర్సంపేట : మేడారం జాతరకు వేలాదిగా జనం తరలిరావడంతో స్థానిక బస్టాండ్ జనంతో మంగళవారం కిటకిటలాడింది. నేటి (ఈనెల 21) నుంచి 24 వరకు మేడారం మహా జాతర జరుగనుండగా పల్లెలు, పట్టణాలు, నగరాల నుంచి మేడారానికి జనం పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో స్థానిక బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు అవసరమైన తాగునీటి, ఇతర సదుపాయాలు కల్పించారు. మహిళలకు ఫ్రీగా వెళ్లే అవకాశం ఉండడంతో ఈసారి మరింతగా జనసందోహం నెలకొంది. ఆర్టీసీ డీఎం ప్రసన్నలక్ష్మి అధికారులతో కలిసి క్యూలైన్లను, ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం



మాజీ సర్పంచ్‌లతో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న, తదితరులు

● జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న

నల్లబెల్లి : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకమని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న తెలిపారు. పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో రాంపూర్ ఫంక్షన్ హాలులో తాజా మాజీ సర్పంచ్‌లను ఎంపీపీ ఊడుగుల సునీతతో కలిసి జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న మంగళవారం ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీ అయిన ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు వీడ్కోలు, బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ నర్సింహమూర్తికి స్వాగతం పలుకుతూ సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న మాట్లాడారు. సర్పంచ్‌లుగా గ్రామాల అభివృద్ధిలో క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఐబీ డీఈ రవి, ఎంపీఓ కూచన ప్రకాశ్, వైస్ ఎంపీపీ గందె శ్రీలత, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ సుబ్బారావు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో శివాని పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి అవార్డులు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ మొలుగూరి సురేందర్ తెలిపారు. అవార్డులు అందుకున్న విద్యార్థులను గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డైరెక్టర్ కంభంపాటి ప్రతాప్, కొనకంటి రామకృష్ణ, బాలాజీ విశ్వనాథ్, శ్రీరాం కిరణ్, గంధం స్వాతి దేవేందర్, గిరగాని రాహుల్, ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు గూడెపు స్నేహిత, మోతే శివ సాయిచరణ్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్నట్లు తెలిపారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా హాజరైన విద్యార్థులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతి గదిలో బోధించిన తీరు ఉపాధ్యాయులను, సిబ్బందిని ఆకట్టుకుంది. డీఈఓగా మంద అఖిల, ఎంఈఓగా రెడ్డబోయిన హరీశ్, హెచ్‌ఎంగా కాసాని కీర్తి ప్రసన్న, పీఈటీలుగా మురళి కృష్ణ, నిక్సన్, జూనియర్ అసిస్టెంట్‌గా భూక్య నరేశ్, ఉపాధ్యాయులుగా అస్మిత, భార్గవి, కీర్తన, లహరిక, నందిని, నీతు ప్రియ, రేష్మ, నస్రిన్, సింధూజ, స్వాతి, అభిలాశ్, అర్జున్, గణేశ్, మహేశ్, జాన్, రక్షిత, పవన్,, రుతిక్ రోషన్, సంతోశ్, తరుణ్, హారిక, అటెండర్‌గా వర్షిత వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు మాట్లాడారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. విద్యారంగంలో సంపూర్ణ అవగాహన కల్పించే దిశగా కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

ఎన్డీ నాయకుడికి నివాళి

నర్సంపేట : పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆ పార్టీ ఏపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు లింగన్న చిత్రపటానికి నాయకులు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు సుమన్, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు తిరుపతి, సాంబన్న, రాజు, కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య



వర్ధన్నపేట : భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. దమ్మన్నపేటకు చెందిన పత్తి సాంబరాజు (22)కు జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు గ్రామానికి చెందిన రాజేశ్వరితో గతేడాది వివాహం జరిగింది. ఈ క్రమంలో సోమవారం రాజేశ్వరి పుట్టింటికి వెళ్తానని భర్త సాంబరాజుతో చెప్పగా అతను వారించాడు. ఆమె వినకుండా వెళ్తుండగా సాంబరాజు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు సాంబరాజును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తీసుకెళ్లగా అక్కడ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటికి పంపడం లేదని కడతేర్చాడు

● బాలిక మృతి కేసును ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవీందర్

పర్వతగిరి : తనను ఇంటికి పంపడం లేదనే కారణంతో సర్కస్ చేసేందుకు వచ్చిన బాలికను అన్నయ్యే కాల్వలో తోసేసి హత్య చేశాడు. ఈనెల 18న మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలో బాలిక మృతదేహం లభ్యం కాగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ రాజగోపాల్, ఎస్సై వీరభద్రరావు విచారణ చేపట్టగా సంధ్య పెద్దనాన్న కుమారుడే ఆమెను హతమార్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మామునూరు ఏసీపీ పులిగిల్ల రవీందర్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ (నేరస్తుడు) చిన్నప్పటి నుంచి కుటుంబ సభ్యులతో కలిసి సర్కస్ చేసేందుకు వెళ్లేవాడు. ఏడాది నుంచి అతడి అన్న చిన్న, వదిన శాంతితోపాటు సమాని రవి అతడి భార్య స్వప్న, పిల్లలు సంతోశ్, సంధ్య(5)తో కలిసి సర్కస్ చేస్తున్నారు. వీరు ఇంటి నుంచి వచ్చి చాలా రోజులు కావడంతో సదరు బాలుడికి (నేరస్తుడు) ఇంటికి పోవాలనిపించింది. ఇంటి వద్ద పెంపుడు కుక్కలను కూడా చూడాలనిపించింది. కొద్ది రోజులుగా ఇంటికి వెళ్తానని అన్నను అడుగగా ఎండాకాలంలో వెళ్దామని నచ్చజెప్పారు. ఆదివారం ఇరు కుటుంబాలు మండలంలోని ఇస్లావత్ తండాకు సర్కస్ చేసేందుకు రాగా సమీపంలోని రెడ్లవాడకి వెళ్లే దారిలో చర్చికి ప్రేయర్ నిమిత్తం వెళ్లాడు. అక్కడే కాల్వను చూసిన బాలుడికి నీళ్లను చూడగా సంధ్యను కాల్వలో తోసేస్తే ఆమె మృతి చెందుతుందని, ఆమె మృతదేహన్ని ఇంటికి తీసుకుపోయి అంత్యక్రియలు చేస్తారని, అప్పుడైతే తన కుటుంబీకులతో కలిసి ఇంటికి పోవచ్చని ఆలోచన వచ్చింది. అనంతరం గుట్టుగా సంధ్యను బైక్‌పై ఎక్కించుకొని కెనాల్ వద్దకు తీసుకెళ్లి నీళ్లలో తోసేయగా ఆమె మునిగిపోయింది. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, హత్య కేసుగా నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ రాజగోపాల్, ఎస్సై వీరభద్రరావు, సిబ్బందిని ఏసీపీ రవీందర్‌రావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి



రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన మండల శివారులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని మైలారానికి చెందిన ఆటోడ్రైవర్ గూడెల్లి శ్రీనివాస్(45) వర్ధన్నపేట నుంచి తన ఆటోలో రాయపర్తికి వస్తుండగా సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ రత్నమాల, టీం సభ్యులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ, సిద్ధార్థ, సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూళ్లలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను ఎంఈఓ రత్నమాల, అధికారులు బైరి సరళ, మానుపాటి పాపమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. ఫార్మటివ్ అసెస్మెంట్ మార్కుల రికార్డులు, బుక్ రివ్యూ, ల్యాబ్ యాక్టివిటీస్, క్రియేటివ్ ప్రోటిమ్స్, కరిక్యూలర్ ఆక్టివిటీస్‌తోపాటు పలు అంశాలను పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పరిశీలన బృందం సభ్యులు పోలెపల్లి రవి, వేముల కిశోర్, రవీందర్, జగన్‌మోహన్, అనుపమ, ఉమాదేవి, సురేశ్‌కుమార్, హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, రజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన దౌడు కొమురయ్య, మేకల ఐలయ్య, ఓదెల కొమురయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలికిశోర్‌రెడ్డి మంగళవారం రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి డబ్బులు పంపించగా బాధిత కుటుంబాలకు నాయకులు అల్లం మర్రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయిలి ప్రభాకర్, నాయకులు మాదాసి రాంబాబు, దౌడు భరత్, కందికొండ రాజ్‌కుమార్, ప్రవీణ్, యాకూబ్, క్రాంతి, రవి, మేకల మోహన్ తదితరులు అందించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

తొర్రూరు: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శాంతికుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. రూ.15లక్షలతో హచ్చుతండా సమీపంలోని డంపింగ్ యార్డు ప్రహరీ నిర్మిస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, నాయకులు కర్నె నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.